క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు


బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీ కోసం కష్టపడిన అందరికి ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలిచ్చిన తీర్పుని గౌరవిస్తున్నామని, రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ప్రజల తరఫున పోరాడదామని, కచ్చితంగా మళ్లీ తిరిగి లేస్తామన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు సమన్వయం పాటించాలని కోరారు.

నాగేశ్వరస్వామి దేవస్థానంలో మాస శివరాత్రి ప్రత్యేక పూజలు



చేబ్రోలు: వసంత రుతువులోని వైశాఖ మాస బహుళ చతుర్థశి మాస శివరాత్రి సందర్భంగా ఖ్యాతి గాంచిన చేబ్రోలులోని నాగేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజత నాగాభరణంలో ప్రత్యేక అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. వసంత రుతువులో లభ్యమయ్యే పూలు, పండ్లతో పూజలు, అలంకరణను అర్చకులు నిర్వహించారు. ఈ రుతువులో లభ్యమయ్యే మల్లెపూలు, మామిడి ఫలాలతో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

రోగులకు సంచుల పంపిణీ



గుంటూరు మెడికల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా బుధవారం జీజీహెచ్ నాట్కో సెంటర్‌లో 300 మంది రోగులకు కీర్తన ట్రస్ట్ అధ్యక్షురాలు మేరీగ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్లు ఆశా సజని, గంగమ్మ, కిరణ్మయి పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయం

ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు

గుంటూరు మెడికల్: ఎన్నికల నిర్వహణలో ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయమని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అన్నారు. ఏపీ ఎన్జీవో హోంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న నారా చంద్రబాబు నాయుడుకు ఉద్యోగుల పక్షాన అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికల్లో ఉద్యోగులు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్, సాంకేతిక అంశాల్లో సహాయ సహకారాలు అందించిన ఎన్నికల కమిషన్, జిల్లా యంత్రాంగానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కరోనా సమయంలో ఉద్యోగులు ప్రాణాలకు తెగించి సేవలు అందించారన్నారు. ఆంధ్రప్రదేశ్ నూతన ప్రభుత్వం ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకొని సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా సంయుక్త కార్యదర్శి కురాకుల శ్రీనివాసరావు, ఏ.శ్యామ్ సుందర్ శ్రీనివాస్, గుంటూరు నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్. సూరి, కార్యదర్శి సీహెచ్. కల్యాణ్ కుమార్, ప్రత్తిపాడు తాలూకా అధ్యక్షుడు సీహెచ్. అనిల్ కుమార్, సునీల్ కుమార్, వేణుగోపాల్, ఇస్సాకు పాల్గొన్నారు.

బాల సాహిత్య పుస్తకావిష్కరణ



తెనాలిఅర్బన్: తెలంగాణ సారస్వత పరిషత్ వారు రూపొందించిన 'బాల సారస్వతం' పిల్లల కథల పుస్తకాన్ని బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలలో బుధవారం పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు చెందిన రచయితలు పంపిన 117 కథలతో సంస్థ వారు అయిదు పుస్తకాలు ముద్రించినట్లు తెలిపారు. తెనాలికి చెందిన బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీం జానీ రూపొందించిన నాలుగు గుండిగలు కథ కూడా పుస్తకంలో ఉందన్నారు. అనంతరం హకీం జానీని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి పావని, ఏ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

తేలిన అభ్యర్థుల భవితవ్యం

- పొన్నూరు బరిలో 14 మంది అభ్యర్థులు
- మొత్తం 2,27,135 ఓట్లు, పోలైనవి 1,93,875


ఓట్లను లెక్కిస్తున్న అధికారులు (ఫైల్)

అభ్యర్థి	పార్టీ	ఓట్లు
ధూళిపాళ్ల నరేంద్రకుమార్	టీడీపీ కూటమి	1,10,410
అంబటి మురళీకృష్ణ	వైఎస్సార్ సీపీ	77,495
జక్కా రవీంద్రనాథ్	కాంగ్రెస్	2,400
యాతాటి కిషోర్	బహుజన సమాజ్ పార్టీ	1,451
అక్కిదాసు జోసఫ్	రిఫార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా	217
డాక్టర్ కూరపాటి మాణిక్యరావు	విడుతలై చిరుతైగల్	109
డాక్టర్ గాలింకి జాన్ శామ్యూల్	ఇండియన్ లేబర్ పార్టీ	43
గోన రాబర్ట్	తెలుగు రాజ్యాధికార	48
జొన్నాదుల రమేష్	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా	90
మొద్దు సాంబశివరావు	జైభీమ్ రావ్ భారత్	42
వరికుంట రోశయ్య	జై భారత్ నేషనల్ పార్టీ	52
షేక్ మస్తాన్‌వలి	నవరంగ్ కాంగ్రెస్	100
దొప్పలపూడి వాసుదేవరావు	ఇండిపెండెంట్	76
అదాల లక్ష్మణరావు	ఇండిపెండెంట్	94
నోటా		1248
మొత్తం		1,93,875

పొన్నూరు: ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ఫలితాలపై పోస్ట్‌మార్టం ప్రారంభించారు. పొన్నూరు నియోజకవర్గం అసెంబ్లీ బరిలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 14 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. మంగళవారం ఏఎన్‌యూ వేదికగా నిర్వహించిన ఓట్ల లెక్కింపులో అభ్యర్థుల బలాబలాలు తేలాయి. ప్రధానంగా వైఎస్సార్ సీపీ నుంచి అంబటి మురళీకృష్ణ, టీడీపీ కూటమి అభ్యర్థిగా ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పోటీలో నిలిచారు. పోటాపోటీగా జరిగిన ఎన్నికలలో కూటమి అభ్యర్థి విజయం సాధించారు. రెండో స్థానంలో అంబటి మురళీకృష్ణ నిలిచారు. నియోజకవర్గంలోని మొత్తం 264 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 14 టేబుళ్లలో 19 రౌండ్లలో లెక్కింపు జరిగింది. 1,93,875 ఓట్లు అభ్యర్థులకు దక్కాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటూ కీలకమే. ఓటేసేందుకు పోలింగ్ కేంద్రం వరకు వచ్చి బరిలో నిలిచిన అభ్యర్థులు ఎవరూ నచ్చలేదని నిరసనను తెలియజేస్తూ నోటాకు ఓటు వేయడం విశేషం. నియోజకవర్గంలో 1,248 మంది ఓటర్లు నోటాను నొక్కి నేతలు ఎవరూ నచ్చలేదని సూటిగా స్పష్టం చేశారు. లెక్కింపులో ఏ పార్టీ అభ్యర్థికి ఎన్ని ఓట్లు లభించాయంటే..

బాలికా విద్యకు అప్‌'గ్రేడ్'

- ఆదర్శంగా నిలుస్తున్న వెంగళరావునగర్ బాలికోన్నత ఇంగ్లిష్ మీడియం పాఠశాల
- గత ఏడాది ఎలిమెంటరీ స్కూలు నుంచి అప్‌గ్రేడ్
- పోటీ పరీక్షలకు ప్రత్యేక తర్ఫీదు
- డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థినులకు బోధన



వెంగళరావు నగర్‌లోని నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాల

నెహ్రూనగర్: విద్యా రంగంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విప్లవాత్మకమైన మార్పులతో గుంటూరు నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు అత్యున్నత ప్రమాణాలతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిలుస్తున్నాయి. అద్భుతమైన ఫలితాల్ని సాధిస్తున్నాయి. విద్యార్థుల్ని మెరికల్లా తీర్చిదిద్దుతున్నాయి. తూర్పు నియోజకవర్గం పరిధిలోని వెంగళరావు నగర్ 5/3లో ఉన్న గుంటూరు నగరపాలక సంస్థ ఎలిమెంటరీ స్కూల్ గత ఏడాది జూన్ 28న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలగా(1 నుంచి 10వ తరగతి వరకు) అప్‌గ్రేడ్ అయింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆడపిల్లల్ని మాత్రమే చేర్చుకునేందుకు హెచ్‌ఎం, విద్యా కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. తూర్పు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తల్లిదండ్రులకు అవగాహన కలిగిస్తున్నారు.

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

నగర పరిధిలో సీసీ కెమెరాల పర్యవేక్షణ కలిగిన ఏకైక పాఠశాలగా వెంగళరావునగర్ పాఠశాలను చెప్పుకోవచ్చు. నిత్యం సీసీ కెమెరాల పర్యవేక్షణలో నడుస్తుంది. ఉదయం 9 గంటలకు గల్లా గేట్లు క్లోజ్ చేస్తే ఇక సాయంత్రం 4 గంటలకే తెరుచుకునేది. మధ్యలో ఎటువంటి పర్మిషన్స్ ఉండవు. స్కూల్‌లోనే విద్యార్థినులకు రోజుకొక మెనూతో రుచికరమైన భోజనం అందిస్తున్నారు. ప్రభుత్వం రూ.20వేల విలువైన ఉచిత టెక్స్‌బుక్స్, నోట్స్‌లు, వర్క్ బుక్స్, స్కూల్ బ్యాగ్, మూడు జతల యూనిఫాం, షూస్, సాక్స్, బెల్టు ఉచితంగా అందజేస్తోంది.


బోధన కోసం ఏర్పాటు చేసిన డిజిటల్ సెటప్


అడ్మిషన్లపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

విద్యార్థినులపై వ్యక్తిగత శ్రద్ధ

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా డిజిటల్ పద్ధతిలో బోధన చేస్తున్నారు. అన్ని రాష్ట్ర, జాతీయ పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జాతీయ, సంప్రదాయ పండుగల రోజుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థినుల్లో మానసిక ఉల్లాసం కోసం ఆటలు, ప్రతి శనివారం నో బ్యాగ్ డే, మాస్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. చదువులో వెనకబడిన వారిపై మరింత దృష్టి సారిస్తున్నారు.

18 కాలనీలకు ఒక్కటే బాలికోన్నత పాఠశాల



బొంగరాలబీడు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు, నెహ్రూనగర్ నుంచి అమరావతి రోడ్డు వరకు సుమారు 18 కాలనీలకు మధ్యలో వెంగళరావునగర్ బాలికోన్నత పాఠశాల ఉండటం విశేషం. సీసీ కెమెరాల నిర్వహణతో పాటు ఆర్వో ప్లాంట్ ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నాం. ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి పాఠశాలకు సంబంధించిన సమాచారాల్ని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేస్తున్నాం.

–పి. రమేష్, హెడ్ మాస్టర్, వెంగళరావునగర్ బాలికోన్నత పాఠశాల

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు



సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. ముఖ్యంగా ఎలిమెంటరీ స్కూల్‌గా ఉన్న వెంగళరావునగర్ పాఠశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వారు స్పందించి గత సంవత్సరం అప్‌గ్రేడ్ చేశారు. ఈ ప్రాంతంలో బాలికోన్నత పాఠశాల ఉండటం ఆడపిల్లల తల్లిదండ్రులకు భరోసా కలుగుతుంది.

– చందు పవన్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో అధికారులు

పెదకాకాని: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏపీసీ జి.విజయలక్ష్మి అన్నారు. పెదకాకాని మండలం, ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాల్లో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సమగ్ర శిక్షణ అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జి.విజయలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్క నాటి పెంచాలన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఈనెల 12వ తేదీ నుంచి 19 వరకూ జరిగే పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యవరణ పరిరక్షణ, మొక్కలు పెంచడం, ప్లాస్టిక్ వాడకం ద్వారా కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించాలన్నారు. తొలుత పర్యావరణ పరిరక్షణపై అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు, జిల్లా సమగ్ర అకడమిక్ మానిటరింగ్ అధికారి ప్రసాద్, సీఎంఓ ఐ.సుజాత, మండల విద్యాశాకాధికారులు డి.బలిరాం, వి.శంకరరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నూతక్కి అబ్రహాం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి


కవుల చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న మాస్ సంఘ సభ్యులు

తెనాలిరూరల్: మధుర కవి నూతక్కి అబ్రహాం విగ్రహాన్ని తెనాలి బండ్‌పై ఏర్పాటు చేయాలని మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘం(మాస్) సభ్యులు కోరారు. 'మాస్' రాష్ట్ర నాయకులు కూచిపూడి మోహన్ మాదిగ ఆధ్వర్యంలో రూరల్ మండలం కొలకలూరు గ్రామ సెంటర్ వద్ద గుర్రం జాషువా ప్రియ శిష్యుడు నూతక్కి అబ్రహాం వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ మాట్లాడుతూ గుర్రం జాషువా గబ్బిలం రచిస్తే శిష్యుడు అబ్రహాం మత్కుణం మీద రాసిన పద్యం మరువలేనిదని అన్నారు. న్యాయవాది సుద్దపల్లి మురళీధర్ మాట్లాడుతూ తెనాలి బండ్‌పై అబ్రహాం విగ్రహాన్ని ఏర్పాటు చేసే విధంగా ఎమ్మెల్యే మనోహర్ చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సుద్దపల్లి అంబేడ్కర్, భవనాసి హేబెల్, మోదుకూరి దావీదు, ఉన్నం జానుబాబు, ఉన్నం చిన్నజాను, ఉన్నం సన్నీ, ఉన్నం గోపి, ఉన్నం ఇమ్మానుయేలు, జర్నలిస్ట్ నూతక్కి ఆచారి, నూతక్కి స్వరాజ్ వర్మ పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ జన్మదిన వేడుకలు


ఆంజనేయునికి లడ్డూలతో అర్చన

తెనాలి: స్థానిక షరాఫ్ బజారులోని శ్రీ సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకలు, శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శ్రీ హనుమత్ గాయత్రీ హోమం, 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ, సాయంత్రం స్వామి వారికి 1108 లడ్డూల అర్చన చేశారు. పండితులు వైదిక క్రతువును ఆగమోక్తంగా నిర్వహించారు. శ్రీ హనుమాన్ చాలీసా పారాయణలో మహిళా భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త ములుకుట్ల విశ్వనాథ శర్మ సుందరకాండ ప్రవచనం చేశారు. భక్తులు విశేషంగా పాల్గొని ఆంజనేయ స్వామికి ప్రదక్షిణాలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకల్లో భాగంగా జూన్ 11వ తేదీ వరకు వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకలు, 16వ లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిరోజు 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ, స్వామి వారికి విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు తీసుకోవాలని కోరారు. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సంకీర్తన సేవాసమితి సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, ఉప్పల వరదరాజులు, మదుపల్లి చంద్రశేఖర్, ఆర్.సురేష్, ఎం వెంకటేష్, బి.లీలాప్రసాద్, గోలి సోమశేఖర్, సంకీర్తన బృందం సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు వస్త్రాలు పంపిణీ

తెనాలిరూరల్: సినీ దర్శకుడు దిలీప్‌రాజా తన జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు నూతన వస్త్రాలు అందజేసి వారితో కలిసి భోజనం చేశారు. తెనాలి మండలం కొలకలూరు గ్రామంలో కాల్వ కట్ట వెంబడి కొంతమంది నిరుపేదలు నివసిస్తున్నారు. తన జన్మదినం సందర్భంగా బుధవారం అక్కడకు వెళ్లిన ఆయన వారికి వస్త్రాలు ఇవ్వడంతో పాటు ఆహార పొట్లాలు అందజేసి వారితో కలిసి భోజనం చేశారు.

తెనాలిలో చిరుజల్లులు



తెనాలిఅర్బన్: తెనాలిలో బుధవారం సాయంత్రం చిరు జల్లులతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ వేడిమితో జనం అల్లాడారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి చిరుగాలులు వీచాయి. అనంతరం చిరు జల్లులతో కూడిన వర్షం కొద్దిసేపు పడింది. దీంతో ప్రజలు కొంత సేదతీరారు.

పర్యావరణ పరిరక్షణతోనే భావితరాల మనుగడ


ఉపాధ్యాయ బృందంతో విష్ణువర్ధన్, కృష్ణవేణి, పద్మజ


టీజేపీఎస్ కళాశాల ప్రాంగణంలో మొక్క నాటుతున్న కె.వి. బ్రహ్మం, మనోహర్ తదితరులు


మొక్కలు నాటుతున్న వాసవీ క్లబ్ సభ్యులు

గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణతోనే భావితరాల మనుగడ సాధ్యపడుతుందని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా బుధవారం లక్ష్మీపురంలోని పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ పుడమి రక్షణ మన భవిష్యత్తుకు శ్రీరామరక్ష అన్నారు. అందరూ ప్రకృతిని ప్రేమిస్తూ, పర్యావరణాన్ని రక్షిస్తూ ముందుకు సాగితేనే భావితరాలకు మనుగడ సులభతరం అవుతుందని తెలిపారు. ఊపిరినిచ్చే చెట్టుని కాపాడితే ఊపిరిని పోసి జన్మనిచ్చిన తల్లిలా కాపాడుతుదని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యత తెలుపుతూ నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, సీనియర్ కోఆర్డినేటర్ డి. దుర్గా శ్యామ్, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ శ్రీదేవి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణానికి మేలు

నెహ్రూనగర్: మొక్కల పెంపకంతో పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని గుంటూరు వాసవీ క్లబ్ చైర్మన్ నగేష్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం 53వ డివిజన్‌లోని మున్సిపల్ స్కూలులో గుంటూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఎంతో ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సెక్రటరీ ఆంజనేయులు, మాజీ సైనిక ఉద్యోగి షేక్ మౌలాలి, విద్యా కమిటీ మెంబర్ పీటర్ పాల్, పాఠశాల హెచ్‌ఎం రమేష్ పాల్గొన్నారు.

పర్యావరణానికి తీవ్ర విఘాతం

లక్ష్మీపురం: మానవుని స్వార్థపూరిత చర్యల మూలంగా గతంలో ఎన్నడూ లేనంతగా పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోందని విశ్రాంత ఇంజినీర్, పర్యావరణ పరిరక్షణ ప్రచారకులు ఎస్.సదాశివం అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలని, ప్రభుత్వాలు కూడా ఈ దిశగా కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని 'మన భూమి-మన భవిష్యత్తు' అనే నినాదంతో జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రాం సూచించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, పర్యావరణ పరిరక్షణ ఉద్యమ నాయకులు పి.ఎస్.మూర్తి ప్రసంగించారు.

జీవకోటి మనుగడకు మొక్కలు నాటాలి

గుంటూరు ఎడ్యుకేషన్: భూమిపై మానవజాతితో పాటు సమస్త జీవకోటి మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షణ చేసినప్పుడే సకాలంలో వర్షాలు పడతాయని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే కృత్రిమ రసాయనాలు, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ ఏటా పర్యావరణ దినోత్సవాన్ని కళాశాలలో విధిగా నిర్వహిస్తూ, మొక్కలు నాటుతున్నామని తెలిపారు. భావితరాలకు పచ్చదనంతో నిండిన స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భాను మురళీధర్ పాల్గొన్నారు.

తరిగిపోతున్న పచ్చదనంతోనే అధిక ఉష్ణోగ్రతలు


మొక్క నాటి, నీరు పోస్తున్న రామకృష్ణప్రభు, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: పచ్చదనం తరిగిపోతున్న కారణంగానే సమస్త జీవకోటి భరించలేని అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కర్పూరపు రామకృష్ణప్రభు పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సంగడిగుంటలోని కళాశాలలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న కారణంగా భూమిపై జీవరాశులు తల్లడిల్లిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చెట్ల నరికివేతతో ఎండలు విపరీతంగా పెరిగిపోతున్నాయని చెప్పారు. భూతాపాన్ని తగ్గించేందుకు విరివిగా మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. కళాశాల కమిటీ సభ్యుడు కర్పూరపు సూర్యనారాయణ మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణంలో కాలుష్యం తరిగిపోయి, పుష్కలంగా ఆక్సిజన్ అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారి ఏ.శ్రీధర్, అధ్యాపకులు రాజరాజేశ్వరి, ఇందిర, ప్లేస్‌మెంట్ అధికారి చంద్రశేఖర్, కల్చరల్ కో-ఆర్డినేటర్ మధుసూదన్, విద్యార్థులు పాల్గొన్నారు.